ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శుక్రవారం 8 మార్చి 2024

ఆడజన్మ ఓ వరం



- నచ్చిన రీతిలోనే జీవిస్తున్నాం
- 'ఆంధ్రజ్యోతి'తో జగిత్యాల మహిళా అధికారుల మనోగతం
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఆడ జన్మ ఓ వరమని, మరు జన్మ అంటూ ఉంటే ఆడపిల్లగానే పుట్టాలని ఉందని వివిధ ప్రభుత్వ శాఖల్లో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న మహిళా అధికారులు పేర్కొంటున్నారు. ఉద్యోగం, కుటుంబ బాధ్యత అంటే మగవారికే అనుకునే రోజులు గతం.. వంటిల్లే కాదు.. రాజకీయాలు, విద్య, వ్యాపారాలు, ఉద్యోగాలు అన్నింటా అతివలు సగం అనేది ప్రస్తుతం అంటున్నారు.. ఇంటి బాధ్యతతోనే పరిమితం కాకుండా పురుషులతో సమానంగా తమ సత్తాను చాటుతున్నాంటున్నారు. చదువుతోనే చైతన్యమని, నేటికి కొన్ని ప్రాంతాల్లో వివక్ష కొనసాగుతూనే ఉందని, సమాజంలో ఉన్నత స్థితికి చేరుకోవాలన్నా, గౌరవప్రదమైన గుర్తింపు రావాలన్నా...ఏకైకా మార్గం విద్య, ఉద్యోగం అని అభిప్రాయపడుతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పు చెందుతూ మనోధైర్యంతో ముందుకు సాగాలని, గ్రామీణ మహిళల్లోనూ ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయాలంటే వెన్నుతట్టి ప్రోత్సహించాల్సిన అవసరముందని పలువురు మహిళా అధికారులు తమ మనోగతాన్ని వెల్లడించారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తోన్న మహిళా అధికారుల మనోగత ప్రత్యేక కథనం...

- ఆంధ్రజ్యోతి, జగిత్యాల

ప్రతీ మహిళ ఆర్థికంగా ఎదగాలి



సత్యమ్మ, జిల్లా ఉపాధి కల్పనా అధికారి

ప్రతీమహిళ తనకు తాను ఎదిగేలా చదువుకోవాలి. ఆర్థికంగా నిలదొక్కుకునేలా పురుషులతో పోటీగా వ్యాపార రంగంలో ముందుకు వెళ్లాలి. ఉద్యోగం బాధ్యతగా చేపట్టాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా స్త్రీలు మారుతూ పోటీ ప్రపంచంలో ముందుకు సాగాలి.

మహిళల్లో చైతన్యం రావాలి



సీహెచ్ సోఫియా, జిల్లా కోశాధికారి

ప్రతీ స్త్రీ చదువుకుంటేనే సమాజం వెలుగుతుంది. మహిళలు తమ హక్కులను స్వచ్ఛందంగా పొందాలి. రిజర్వేషన్ల ఆధారంగా అన్ని రంగాల్లో మహిళలు పురుషులతో పోటీపడాలి. వరకట్నం, ఆడవాళ్లపై కక్ష సాధింపులు కొనసాగుతున్నాయి. వీటిని అరికట్టాలి. ప్రభుత్వం మహిళా హక్కులపై చొరవ చూపడం అభినందనీయం.

పరిసరాల పరిశుభ్రతలో మహిళల పాత్ర కీలకం

డాక్టర్ సుదక్షిణాదేవి, వైద్య విధాన పరిషత్, జిల్లా కో ఆర్డినేటర్



పల్లెలతో పాటు పట్టణాల్లో పరిశరాల పరిశుభ్రతలో మహిళల పాత్ర కీలకం. మహిళలు సంఘాలుగా ఏర్పడి బిజినెస్ రంగంలో మరింత రాణించాలి. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించుకోవాలి. ఒక మహిళ రాణింపు మరో మహిళకు స్ఫూర్తిని ఇవ్వాలి. మహిళా సాధికారతకు ప్రతిఒక్కరూ పాటుపడాలి.

వివక్ష లేని సమాజం నిర్మించాలి

మనీలా, సఖి కేంద్రం ఇన్‌చార్జి



సమాజంలో మహిళలను చిన్న చూపు చూడటం తగదు. మహిళలు నేటి ప్రపంచంలో ఒక శక్తిగా ఎదుగుతున్నారు. కుటుంబ బాధ్యతలు చేపట్టే ప్రతి మహిళ అదే బాధ్యతగా ఉద్యోగం సాధించేలా కృషి చేయాలి. వివక్ష లేని సమాజం నిర్మించాల్సిన అవసరముంది. మహిళలు విద్య, ఉద్యోగం రంగాల్లో రాణించేలా ప్రోత్సాహం అందాలి.

ఆర్థిక స్వావలంబనలో మహిళలదే కీలక పాత్ర

సునీత, ఆర్‌టీసీ డీఎం, జగిత్యాల



ఆర్థిక స్వావలంభనలో మహిళలే కీలకపాత్ర పోషిస్తున్నారు. భారతదేశంలో మహిళలు వ్యవసాయంపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. యువతులు నూతన టెక్నాలజీని ఉపయోగించుకుని ముందుకు వెళ్లాలి. పొదుపు సంఘాలను ఏర్పాటు చేసుకుని మహిళలు ఆర్థికంగా మరింత ఎదగాలి.

కష్టపడితేనే సమాజంలో గుర్తింపు

గోలి శ్రీలత, ప్రిన్సిపల్, సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల, జగిత్యాల



మారుతున్న కాలానికి అణుగుణంగా మహిళలు మారాలి. కష్టపడి ఉన్నత స్థితికి ఎదిగినపుడే మహిళలకు సమాజంలో మంచి గుర్తింపు వస్తుంది. పొదుపు పాటించి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేయాలి.



మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

షేక్ యాస్మిన్ బాషా, కలెక్టర్



మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి. విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయం, వ్యాపారం ఇలా పలురంగాల్లో మహిళలు కీలక పాత్రను పోషించాలి. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. వంటింటికి మహిళలు పరిమితం కాదని, అవసరమైన ఏ బాధ్యతనైనా సమర్థవంతంగా నిర్వర్తిస్తారని చాటాలి. గొప్పగొప్ప మహిళ నేపథ్యాలను స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలి.

మహిళల్లో వెనుకబాటుతనం పోవాలి

వి. నీలిమ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి



మహిళల్లో వెనుకబాటుతనం పారద్రోలేందుకు వారిలో ధైర్యం కల్పించాలి. మహిళలకు అవగాహన సదస్సులు నిర్వహించి చట్టాలు, శిక్షలపై వారికి వివరిస్తూనే మనోధైర్యం పెంచాలి. అన్నిరంగాల్లో ధైర్యంగా ముందుకు వచ్చే విధంగా వారికి ప్రోత్సాహం కావాలి. వారిలో చైతన్యం తీసుకువచ్చే విధంగా స్వచ్ఛంద సంస్థలు కార్యక్రమాలు చేపట్టాలి.

మహిళగా గర్వపడుతున్నా

బి వాణి, జిల్లా వ్యవసాయ అధికారి



20 సంవత్సరాలుగా వ్యవసాయ శాఖలో పనిచేస్తున్నాను. ఇద్దరు పిల్లల తల్లిగా, అంకిత భావం ఉన్న భార్యగా, సమాజంలో ప్రభావశీలిగా కూడా పాత్ర పోషిస్తున్నాను. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున నా ప్రయాణాన్ని ప్రతిబింబిస్తూ నా కుటుంబం, సమాజం రెండింటికి దోహదపడే పనిచేసే మహిళగా నా గుర్తింపును గర్వంగా స్వీకరిస్తున్నాను.

మహిళలు తమ శక్తిని చాటుకోవాలి

బి. వాణిశ్రీ, జిల్లా సంక్షేమ అధికారి



మహిళలు వంటింటికే పరిమితం కాకూడదు. చదువులో ముందుండి ఉన్నత ఉద్యోగాలు సాధించి తమ శక్తిని చాటుకోవాలి. తమకు నచ్చిన రంగాన్ని ఎంపిక చేసుకుని స్వశక్తితో ముందుకు వెళ్లాలి. సమాజంలో మహిళల పాత్ర ఎంత గొప్పదనే విషయాన్ని ప్రతీఒక్కరికి అర్థమయ్యేలా ఎదగాలి. మహిళా ఉద్యోగులను గౌరవించాలి.

దిక్సూచిగా నిలవాలి

దివ్య భారతి, జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం



ఒకప్పుడు నాలుగు గోడల మధ్య వంటింటి కుందేళ్లుగా మహిళలు ఉండేవారు. ఈ రోజు మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారు. స్వశక్తితో మహిళలు రాజకీయ రంగాల్లో దూసుకెళ్తున్నారు. ఉద్యోగం స్త్రీ బాధ్యతగా చేపట్టినప్పుడే మహిళలు ఆర్థికంగా ఎదుగుతారు. సమాజానికి దిక్సూచిగా మహిళలు నిలవాలి.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

సుజాత, డిస్ట్రిక్ట్ ఆడిట్ అధికారి



ప్రభుత్వం కల్పిస్తున్న సమాన అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. విద్యతో పాటు ఉద్యోగ రంగంలోనూ మహిళలు రాణించాలి. ఇందుకు క్రమశిక్షణ, కృషి, పట్టుదల అవసరము. కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారాలను తీసుకుంటూ అనుకున్న లక్ష్యాన్ని సాధించాలి.

నిరుపేదలకు మిగులు భూములు పంపిణీ చేయాలి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మార్చి 7: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అసైన్డ్ కమిటీ ద్వారా నిరుపేద ప్రజలకు భూములను పంపిణీ చేయాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ భవన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు న్యాయం చేసే విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు. అట్టడుగు వర్గాల వారికి న్యాయం చేకూర్చే విధంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచిస్తే దాన్ని అమలు చేసే విషయంలో బాబు జగ్జీవన్‌రామ్ ముఖ్యభూమిక పోషించారన్నారు. ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ విషయంలో కూడా సీఎం రేవంత్‌రెడ్డి పూర్తి సహాయసహకారాలు అందిస్తున్నారని ఆయన తెలిపారు.

రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలి

- కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా

జగిత్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రంజాన్ పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ముస్లిం ప్రజాప్రతినిదులు, నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రంజాన్ మాసంలో ముస్లింలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్న దృష్ట్యా ప్రార్థన మందిరాల వద్ద పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, విద్యుత్ సరఫరా, నీటి సరఫరాలలో అంతరాయం కలగకుండా చూడాలని అన్నారు. ఉపవాస దీక్షల సందర్భంగా రాత్రివేళల్లో వ్యాపారాలు నిర్వహించుకోవడానికి అనుమతులు ఇవ్వాలని, తినుబండారాల రుచులు, నాణ్యతలను తనిఖీ చేయాలని సూచించారు. మజీదులు, కబ్రస్తాన్‌ల వద్ద హైమస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని, టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేయాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దివాకర, డీఎస్పీ రఘుచందర్, జడ్పీ సీఈవో గౌతం, జిల్లాపంచాయతీ అధికారి దేవరాజు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సాయిబాబా, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ రాంబాబుకు అభినందనల వెల్లువ

జగిత్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పర్స రాంబాబును గురువారం పలువురు రెవెన్యూ అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని చాంబర్‌లో నూతన అదనపు కలెక్టర్ రాంబాబును పలువురు కలెక్టర్ కార్యాలయ సూపరెంటెంట్‌లు, తహసీల్దార్లు, అధికారులు కలిసి పూలమొక్కను అందించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి హన్మంత్ రావు, ఎన్నికల సెల్ తహసీల్దార్ హకీం, పలువురు కార్యాలయ సూపరెండెట్లు, అధికారులు పాల్గొన్నారు.

లోవోల్టేజీ నివారణకు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ఏడీఈ

మల్యాల, మార్చి 7: మండలంలోని ముత్యంపేటలో నెలకొన్న లోవోల్టేజీ నివారణకు విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. లోవోల్టేజీతో ఇబ్బందులు మల్యాల ఏడీఈ సీహెచ్ బాలలింగం దృష్టికి వెళ్లడంతో గురువారం గ్రామంలో 25కెవీ సామర్థ్యం గల రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. అనంతరం వాటి నుంచి విద్యుత్ సరఫరా ప్రారంభించారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో లోవోల్టేజీ సమస్య తీరనుందని ఈ సందర్భంగా ఏడీఈ తెలిపారు. ప్రజలు విద్యుత్ సమస్యలు ఉంటే తమకు తెలుపాలని కోరారు. కార్యక్రమంలో జేఎల్‌ఎం ప్రవీణ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు

రాయికల్, మార్చి 7: రాయికల్ పట్టణంలోని 8వ వార్డులో మంచినీటి సమస్య పరిష్కారానికి గురువారం అధికారులు చర్యలు చేపట్టారు. మున్సిపల్ పంచాయతీరాజ్ ఏఈ సీవీ ప్రసాద్ కాలనీకి వెళ్లి తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి కాలనీవాసులతో మాట్లాడారు. మిషన్ భగీరథ ట్యాంక్‌ను కాలనీకి అనుసంధానం చేసి నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ధర్మపురి, మార్చి 7: పట్టణంలోని గిరుకల కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని గురువారం పోలీసులు పట్టుకున్నారు. గుర్రాల సుధాకర్ వద్ద 14 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ ఉదయ్‌కుమార్ తెలిపారు.

ముస్తాబైన కోటేశ్వరస్వామి ఆలయం



వేడుకలకు ముస్తాబైన కోటేశ్వరస్వామి ఆలయం

వెల్గటూర్, మార్చి 7: మహా శివ రాత్రి వేడుకలకు ప్రముఖ శైవ క్షేత్రం కోటిలింగాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కోటేశ్వర స్వామి ఆలయానికి రంగురంగుల విద్యుద్దీపాలంకరణతో అందంగా ముస్తాబు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు. కోటిలింగాల గోదావరిలో భక్తులు స్నానాలు ఆచరించడానికి తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. చలువ పందిళ్లు, మహిళలు దుస్తులు మార్చుకోవడానికి వీలుగా గదులు, మంచి నీటి సౌకర్యం కల్పించారు. గోదావరిలో స్నానాలు చేసేటపుడు ప్రమాదాలు జరుగకుండా గజ ఈత గాళ్లను అందుబాటులో ఉంచనున్నట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ నారాయణరావు పేర్కొన్నా రు. శివరాత్రి సందర్భంగా ఆలయంలో అర్చనలు, అభిషేకాలు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారులు తెలిపారు.

జగిత్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శివాలయాలు మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. శుక్రవారం నిర్వహించనున్న వేడుకలకు ఆలయాలను నిర్వాహకులు విద్యుద్దీపా లతో అలంకరించారు. క్యూలైన్ల కోసం ప్రత్యేక బారీకేడ్లు ఏర్పాటు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరవుతున్న దృష్ట్యా ఆలయాల ఎదుట చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. గుట్ట రాజరాజేశ్వరస్వామి ఆలయంలో 108 జంటలతో శివకల్యాణ మహోత్సవం ప్రతి యేటా అంగరంగ వైభవంగా జరుగుతుంది. అనంతరం సాయంత్రం సమయంలో స్వామి వారి ఊరేగింపును కన్నుల పండుగగా నిర్వహిస్తారు. అభయాంజనేయస్వామి ఆలయంలో ఉదయం 7 గంటల నుంచే శివ లింగానికి క్షీరాభిషేకం చేసే విధంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. అనంతరం రాత్రి 12 గంటల లింగోద్భవ సమయంలో బిల్వ పత్ర సమర్పణ కార్యక్రమం నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే భక్త మార్కండేయ ఆలయంలో రాత్రి 12 గంటలకు భారీ ఎత్తున బిల్వ పత్ర సమర్పణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. దీంతో పాటు మడేలేశ్వర స్వామి, విశ్వేశ్వరస్వామి, బ్రాహ్మణ వాడలోని శివాలయం, పురాణిపేట శివాలయాల్లో వేడుకలకు ఆలయాలను ముస్తాబు చేశారు.

జగిత్యాలరూరల్: రూరల్ మండలంలోని పొలాసలో గల పౌలస్తేశ్వర, వేయిలింగాల ఆలయాల్లో మహాశివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. మహాశివరాత్రి వేడుకలకు ఆలయాలను ఆలయ ప్రాంగణాలను విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ పరిసరాలను నీటితో శుద్ధి చేశారు. ఆలయాల లోపల ముఖద్వారాలను పూలు, అరటి తోరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివార్లను దర్శించుకునేందుకు సాధారణ క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఆలయపరిసరాల్లో భక్తులు జాగరణ చేసేందుకు చలువపందిళ్లు ఏర్పాటు చేశారు.

● **నేడు, రేపు ప్రత్యేక పూజలు...**

శుక్రవారం ఉదయం నాలుగు గంటల నుంచి రాత్రి 9.30 గంటలవరకు సంకల్పాలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. ఉదయం 8 గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 108 జంటల స్వహస్తములతో పార్థిలింగానికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, లింగార్చన నిర్వహిస్తారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలమున వేద బ్రహ్మణోత్తములతో నిశి పూజ నిర్వహిస్తారు. శనివారం మాఘ బహుళ చతుర్దశి రోజున సాయంత్రం పొలాస వీధులగుండా సేవా ఊరేగింపు నిర్వహిస్తారు.

మల్లాపూర్: మండల కేంద్రంలో శివరాత్రి సందర్భంగా శివాలయాలను నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. గురువారం మండల కేంద్రంలోని సోమేశ్వర కొండపైన గల సోమేశ్వర ఆలయాన్ని శివరాత్రి జాతర కోసం రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నారు. ఆలయాలకు రంగులను వేయించడంతో పాటు రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు.















నకిలీ డాక్యుమెంట్లతో భూకబ్జా కేసులో
తహసీల్దార్ అరెస్టు
- పరారీలో మరికొందరు



తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌ను జైలుకు తరలిస్తున్న సీఐ ప్రదీప్‌కుమార్

కరీంనగర్ క్రైం, మార్చి 7: నకిలీ ధ్రువపత్రం సృష్టించి, భూమి ఆక్రమించిన కేసులో గతంలో కొత్తపల్లి తహసీల్దార్, ప్రస్తుతం గజ్వేల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న చిల్ల శ్రీనివాస్‌తో పాటు 12 మందిపై కొత్తపల్లి మండలం సీతారాంపూర్‌కు చెందిన బొంతల రఘు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపల్లి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్, అతని బినామీ గోదావరిఖనికి చెందిన చంద సంతోష్, గతంలో కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసిన, ప్రస్తుతం తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పల్లె జీవన్‌లను గురువారం అరెస్టు చేసిన పోలీసులు కోర్టు ఆదేశాలతో రాత్రి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో 9 మంది పరారీలో ఉన్నారు. కరీం నగర్ సీతారాంపూర్‌కు చెందిన బొంతల రఘు రాజు తాత ఐలయ్యకు ఉన్న ఆరెపల్లి, సీతారాంపూర్, రేకుర్తిలలోని ఆస్తులను రఘురాజు తండ్రికి, చిన్నాన్నకి 2012లో సమాన భాగాలుగా పంచి రిజిస్ట్రేషన్లు చేయించాడు. సీతా రాంపూర్, ఆరెపల్లిలో ఉన్న భూములు రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రకారమే ఆన్‌లైన్‌లో నమోదు కాగా రేకుర్తికి చెందిన సర్వేనెంబర్ 29లోని 30 గుంటల భూమి మాత్రం రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ అయ్యి ఆన్‌లైన్‌లో చూపించడంలేదు. దీనిపై అప్పటి కొత్తపల్లి తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌ను రఘురాజు సంప్రదించగా సమస్యను పరిష్కరించేందుకు లంచంగా ఆ భూమి నుంచి 3.25 గుంటల భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలని డిమాండ్ చేశాడు. దీనికి బాధితుడు ఒప్పుకోలేదు. 2015లో బాధితుడి తాత ఐలయ్య చనిపోయాడు. దీంతో 2016లో ఐలయ్య అతని భార్య పేరట రిజిస్ట్రేషన్ చేసినట్లుగా నకిలీ డాకుమెంట్లు సృష్టించి, ధరణి ఆపరేటర్‌గా పనిచేస్తున్న అప్పటి వీఆర్‌ఏ అయిన పల్లె జీవన్ సహాయంతో, 2022 ఆగస్టులో బాధితుడి చినాన్నతో పాటు అతని నలుగురి మేనత్తల పేరిట ఒక్కొక్కరి పేరిట నాలుగున్నర గంటలు, ఎమ్మార్వో బినామీ అయిన గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌కు చెందిన చందా సంతోష్ పేరిట 3.25 గుంటల భూమి మార్చాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితుడు రఘురాజు పేర్కొన్నాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టగా విచారణలో బాధితులు తెలిపిన వివరాలు నిజమేనని వెల్లడి కావటంతో 12 మంది చిల్ల శ్రీనివాస్, చంద సంతోష్, బొంతల రవి, బొంతల లావణ్య, ఉప్పుల కనకలక్ష్మి, దాడి రాధ, చుప్ప మంజుల, చిలువేరు స్వప్న, చిలువేరు మల్లేశం, పల్లె జీవన్, వినోద్, బుచ్చిరాజులపై ఐపీసీ 467, 468, 471, 409, 420, 120 బి రెడ్‌విత్ 34 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి కరీంనగర్ కోర్టులో హాజరుపరచగా, కేసును పూర్తిగా పరిశీలించిన మెజిస్ట్రేట్ నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించారు. కొత్తపల్లి పోలీసులు ముగ్గురు నిందితులను కరీంనగర్ జైలుకు తరలించారు.

మహా జన జాతర

- వేములవాడ రాజన్న క్షేత్రంలో మహా శివరాత్రి వేడుకలు ప్రారంభం
- పెద్ద సంఖ్యలో తరలివస్తున్న జనం
- భక్తులకు ఉచిత బస్సుల సౌకర్యం
- పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అధికారులు



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ/వేములవాడ టౌన్, మార్చి 7: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న వేములవాడ రాజరాజేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా ప్రారంభం అయ్యాయి. మూడు రోజులపాటు శివభక్తుల సందడిలో సాగే రాజన్న మహా జన జాతర మహోత్సవాలు గురువారం సాయంత్రం కన్నుల పండుగగా మొదలయ్యాయి. బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాజేశ్వర స్వామికి పట్టు వస్త్రాలను సమర్పించారు. గుడి మైదానంలో శివార్చన ప్రారంభించారు. తెలంగాణలో అతిపెద్ద శైవక్షేత్రంగా ఉన్నా వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రానికి తెలంగాణ, ఆంధ్రా, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, రాష్ట్రాల్లోని వివిధ జిల్లాల నుంచి భక్తులు అశేషంగా తరలివస్తున్నారు. శుక్రవారం మహాశివరాత్రి శివుడి పర్వదినాన్ని రాజన్న క్షేత్రంలోనే జాగరణతో జరుపుకోవడానికి దాదాపు 2 లక్షల మంది తరలివస్తారని అంచనాలు వేసిన అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. మూడు రోజుల పాటు జరిగే వేడుకల కోసం రూ.3 కోట్ల వరకు ఖర్చు చేసి భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. దూర తీరాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు, ఏర్పాటు చేశారు. ఈ సారి ఉచిత పాస్‌లను రద్దు చేసి ప్రతి ఒక్కరూ రూ.300 చెల్లించి వీఐపీ దర్శనాల క్యూలైన్లో వెళ్లే విధంగా ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం నాలుగు లక్ష రాజన్న లడ్డు ప్రసాదాలను సిద్ధం చేశారు. 27 చోట్ల తాగునీటికి ఇబ్బంది లేకుండా చలి వేంద్రాలు, 7 చోట్ల రాజన్న జల ప్రసాదం, లక్ష మజ్జిగ ప్యాకేట్లు, శుద్ధ జల క్యాన్‌లు ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాలు నిరంతరం భక్తులకు వైద్య సేవలు అందించడానికి శిబిరాలను ఏర్పాటు చేశారు. పారిశుధ్య నిర్వాహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తాత్కలిక స్నానపు గదులు, మరుగుదొడ్లు, మహిళలు బట్టలు మార్చుకోవడానికి గదులను అందుబాటులోకి తెచ్చారు.



పూలతో అలంకరించిన ఆలయం

రాజన్నకు కోడె మొక్కులు..

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామికి ప్రత్యేకంగా కోడెమొక్కులను భక్తులు చెల్లించుకుంటున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుండడంతో మూడు రోజుల పాటు అర్జిత సేవలు రద్దు చేసి నిరంతర దర్శనాలను కల్పించారు. గురువారం రాత్రి 7 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే పట్టు వస్త్రాలు, అలాగే తెలంగాణ ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాల సమర్పణ అనంతరం రాత్రి 9 గంటలకు నిశిపూజ భక్తులకు లఘు దర్శనం, కోడెమొక్కులను కొనసాగించారు. శుక్రవార మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా రాత్రి 12 నుంచి 3 గంటల వరకు పురజనులకు సర్వదర్శనం, 3.30 గంటల నుంచి 4 గంటలవరకు ఆలయ శుద్ధి, మంగళవాయిద్యాలు, 4 గంటల నుంచి 4.25 వరకు సుప్రభాతం, 4.25 నుంచి 6 గంటల వరకు ప్రాతకాల పూజ, అనువంశిక అర్చకుల దర్శనం కల్పించారు. సాయంత్రం 4 గంటలకు శివదీక్ష స్వాముల దర్శనానికి కల్పించారు.

మహాలింగార్చన..

మహాశివరాత్రి పర్వదినంలో మహాఘట్టమైన మహా లింగార్చన శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభిస్తారు. రాత్రి 11.35 నిముషాలకు లింగోద్భవ సమయంలో మహాన్యాస పూర్వక ఏకాదశరుద్రాభిషేక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. శనివారం చివరి రోజు భక్తుల మొక్కుబడులు, అర్జిత సేవలు ప్రారంభం కానున్నాయి.

విద్యుత్ దీపాలతో అలంకరణ..

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంతో పాటు అనుబంధ దేవాలయాలు విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా మారాయి. ప్రధాన దేవాలయంలో తీరొక్క పూలలో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్‌కు చేరుకోవడానికి ఆర్టీసీ అధికారులు 900 బస్సులను నడుపుతున్నారు. తిప్పాపూర్ బస్టాండ్ నుంచి ఆలయం వరకు 14 ఉచిత బస్సులను ప్రారంభించారు. భక్తులు వాహనాలు పార్కింగ్ చేసుకోవడానికి 8 చోట్ల స్థలాలు ఏర్పాటు చేశారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

గ్యారంటీలను అమలు చేసే శక్తి ఇవ్వాలని వేడుకున్నాం
- మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ/వేములవాడ టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీల అమలు జరిపే శక్తిని ఇవ్వాలని మహాశివరాత్రి సందర్భంగా శివుడిని వేడుకున్నామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వేములవాడ మహాశివరాత్రి సందర్భంగా శ్రీస్వామి వారికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో వర్థిల్లాలని అన్నారు. ప్రభుత్వాలు ఏవి వున్న, మేము అధికార పక్షంలో వున్న, ప్రతి పక్షంలో వున్న సర్వేజన సుఖినో భవంత్ అందరు సుఖ సంతోషాలతో వర్థిల్లేలా చూడాలని అన్నారు. స్వయంగా మహా శివరాత్రి జాతరకు ముఖ్యమంత్రి రావాల్సివుండేది, డిల్లీలో వున్న సమావేశాలతో రాలేకపోయారు. ఎన్నికల కోడు అమలులోకి రాకపోతే వారం రోజుల్లో వేములవాడను సందర్శించి శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుంటారని తెలిపారు. రాజన్న భక్తుడిగా వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి పాటుపడుతామని చెప్పారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కని విని ఎరగని రీతిలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు చేశామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీ సభ్యులు సైతం సేవతో పని చేస్తున్నారని తెలిపారు.

జాతరకు భారీ బందోబస్తు..

మహా శివరాత్రి జాతరలో ఏలాంటి సమస్యలు తలేత్తకుండా భక్తులు ప్రశాంత వాతావరణంలో దర్శనాలు చేసుకునే విధంగా భారీ పోలీస్ బందోబస్తు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. 1400 మంది పోలీస్ సిబ్బందితో పాటు అన్నీ ప్రాంతాల్లో సీసీ కమెరాలను ఏర్పాటు చేశారు. మహా శివరాత్రి జాతర ఏర్పాట్లను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్, దేవస్థానం ఈవో కృష్ణప్రసాద్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఏర్పాట్లు పరిశీలించి సూచనలు చేశారు.

భక్తులకు సేవ పూర్వ జన్మ సుకృతం



ఉచిత మినీ బస్సులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, మార్చి 7 : భక్తులకు సేవ చేసే భాగ్యం రావడం పూర్వజన్మసుకృతమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అ న్నారు. వేములవాడ మహాశిరాత్రి జాతర సందర్భంగా గురువారం ఆర్టీసీ డిపోలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత మినీ బస్సులను ప్రారంభించారు. అనంతరం ఆలయ పరిసరాల్లోని క్యూలైన్‌లను, చలువ పందిళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మహాశివరాత్రి జాతరకు పేద, నిరుపేద భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తారన్నారు. మహాదేవుని దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం దేవదాయశాఖ ఆధ్వర్యంలో సౌకర్యాలను కల్పించినట్లు చెప్పారు. తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి రాజన్న ఆలయ పార్కింగ్ స్థలం వరకు 14 ఉచిత మినీ బస్సు లను ప్రయాణికుల కోసం అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఉచిత బస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

● **భక్తులకు ఉచిత అల్పాహారం**

మహాశివరాత్రికి వచ్చే భక్తులకు రాజరాజేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో ఉచిత అల్పాహార సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు ఖాళీ కడుపుతో ఉండకూడదని అల్పాహారం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, డిపో మేనేజర్ మురళీకృష్ణ ఉన్నారు.

రాజన్నను దర్శించుకున్న దేవదాయశాఖ కమిషనర్

వేములవాడ టౌన్, మార్చి 7: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారిని దేవదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ గురువారం దర్శించుకున్నారు. మహాశివరాత్రి జాతరను పురస్కరించుకుని ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలి కారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. శ్రీస్వామి వారి అద్దాల మండపంలో కమిషనర్‌కు అర్చకులు ఆశీర్వచనం గావించగా ఆలయ ఈవో కృష్ణప్రసాద్ శాలువతో సన్మానించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

అడవి జంతువు మృతికి కారణమైన వ్యక్తి అరెస్టు

రాయికల్, ఫిబ్రవరి 7: మండలంలోని రాజనగర్ గ్రామానికి చెందిన రాజన్న అనే వ్యక్తిని అటవీ శాఖ అధికారులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తన వ్యవసాయ పొలం చుట్టూ కరెంట్ తీగలు అమర్చగా ఈ నెల 5న అడవి జంతువు సాంబారు మృతి చెందింది. దీంతో రాజన్నపై అటవీ శాఖ అధికారులు అటవీ సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదం కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, మార్చి 7: రోడ్డు ప్రమాదం కేసులో ఎల్లారెడ్డిపేటకు చెందిన భూక్య శ్రీనివాస్‌కు ఏడాది జైలు శిక్షతోపాటు రూ. 3వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం... 12 జూన్ 2018న ఎల్లారెడ్డిపేటకు చెందిన మాలోతు తుకారాం తన స్నేహితుడితో కలిసి కారులో సిద్దిపేటకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా ముస్తాబాద్ మండలంలోని బద్దనకల్ వద్ద కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తుకారాం తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనపై కారు నడిపిన శ్రీనివాస్‌పై కేసునమోదు చేసి కోర్టులో చార్జి షీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ ఎస్‌ఐ శ్రావణ్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ దేవేందర్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా పీపీ సందీప్ వాధించారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి డ్రైవర్‌పై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్షతోపాటు రూ. 3వేల జరిమానా విధించారని ముస్తాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

చంపుతామని బెదిరించిన ముగ్గురికి...

సిరిసిల్ల క్రైం, మార్చి 7: సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌లో ఉంటున్న దూడం సరస్వతి ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి చంపుతామని బెదిరించిన చిట్యాల మధు, నాయిని శంకర్, దుబ్బ నీరజకు ఏడాది జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం... 28 జనవరి 2015న శాంతినగర్‌లోని దూడం సరస్వతి ఇంట్లోకి ముగ్గురు వ్యక్తులు ప్రవేశించారు. రూ. 25లక్షలకు ఆమె భర్త ఇల్లు అమ్మాడని, మిగతా రూ. 5 లక్షలు తీసుకొని వెళ్లిపోవాలని తీవ్రంగా దూషించి చంపుతామని బెదిరించారు. బాధితురాలి ఫిర్యాదుతో అప్పటి ఎస్‌ఐ చీనా నాయక్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో చార్జి షీట్ దాఖలు చేయగా పీపీ చెలుముల సందీప్‌కుమార్ వాధించారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ ముగ్గురు నిందితులకు ఏడాది జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ. 10వేల జరిమానా విధించారని టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

ఆర్టీసీ గ్రాండ్ ఫెస్టివల్ ఛాలెంజ్‌లో
కరీంనగర్ రీజియన్‌కు ప్రథమ స్థానం



పురస్కారం అందుకుంటున్న ఆర్టీసీ అధికారులు

భగత్‌నగర్, మార్చి 7: తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో దసరా, బతుకమ్మ పండుగలకు నిర్వహించిన గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్‌లో కరీంనగర్ రీజియన్‌కు ప్రథమ స్థానం లభించింది. రెండె స్థానంలో మహబూబ్‌నగర్, మూడో స్థానంలో నిజామాబాద్ నిలిచాయి. గురువారం హైదరాబాద్‌లోని ఆర్టీసీకళాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత సన్మానంతో పాటు, ట్రోఫి, లక్ష రూపాయల పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఆర్‌ఎం సుచరితమాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల సమష్టి కృషితోనే అవార్డు దక్కిందన్నారు. రానున్న కాలంలో మరింత ఉత్సాహంతో పనిచేసి సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కరీంనగర్ జోన్ వినోద్‌కుమార్, డిప్యూటి రీజినల్ మేనేజర్ సత్యనారాయణ, పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, డిపో మేనేజర్లు మల్లేశం, మల్లయ్య, మనోహర్, వేదవతి, నర్సప్ప, నాగభూషణం, అర్పిత, తదితరులు పాల్గొన్నారు.

ఏసియన్ అథ్లెటిక్స్ సెలక్షన్ ట్రయల్స్‌కు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్, మార్చి 7: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో ఈనెల 8,9,10 తేదీల్లో జరుగనున్న 22వ అండర్-20 జూనియర్ ఏసియన్ అథ్లెటిక్స్ సెలక్షన్ ట్రయల్స్‌కు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లాకు చెందిన ఎం.వినయ్ 1500 మీటర్లు, 3000 మీటర్ల స్టిపల్ చేస్, పి.విష్ణువర్ధన్ 10వేల మీటర్ల రేస్ వాక్‌లో గత సంవత్సరం జాతీయ అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ చాటిన కారణంగా ఈ పోటీలకు అర్హత సాధించారని జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడారి రవి తెలిపారు. ఈ పోటీల్లో కనబరిచే ప్రతిభ ఆధారంగా దుబాయ్‌లో ఏప్రిల్ 24 నుంచి 27వరకు జరుగబోయే జూనియర్ ఏసియషన్ అండర్-20 చాంపియన్ పోటీలకు అర్హత సాధిస్తారని పేర్కొన్నారు. ఈ క్రీడాకారులను కోచ్ వరుణ్‌ను డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, మార్చి 7: మండలంలోని పచ్చునూర్ గ్రామంలో ఆర్టీసీ బస్సు కిందపడడంతో ఓ ప్రయాణికుడికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన అంకం చంద్రయ్య అనే చేనేత కార్మికుడు గురువారం వ్యక్తిగత పని నిమిత్తం కరీంనగర్‌కు వెళ్లి ఇంటికి ఆర్టీసీ బస్సులో తిరిగి వస్తున్నాడు. గ్రామంలోని యాదవనగర్ బస్టాండ్ వద్ద బస్సు దిగే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి కిందపడిపోయాడు. అతడి కాలుపై నుంచి బస్సు టైరు ఎక్కడంతో కాలు నుజ్జునుజ్జయింది. 108లో కరీంనగర్‌కు తరలించారు.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మార్చి 7: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7, 550 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 51మంది రైతులు 773క్వింటాళ్లు విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,550, కనిష్ఠ ధర 6,500 రూపాయలు చెల్లించారు. శుక్రవారం నుంచి మూడు రోజులు సెలవుగా అధికారులు తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో బంగారం చోరీ

కరీంనగర్ క్రైం, మార్చి 7: కరీంనగర్ బస్టాండ్‌లో ఒక మహిళా ప్రయాణికురాలి హాండ్ బ్యాగ్‌లో నుంచి పద్దెనిమిదిన్నర తులాల బంగారం చోరీ అయింది. ఈ మేరకు బాధితురాలు ఒకటో ఠాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం ఆకునూర్ ఘనపురంకు చెందిన మెల్లం కొమురమ్మ అనే మహిళ మూడు రోజుల కిందట తన కొడుకు వద్దకు గోదావరిఖని సెంటనరీ కాలనీకి వెళ్లింది. తిరిగి స్వగ్రామం అకునూర్ ఘనపురంకు వెళ్లేందుకు గురువారం ఉదయం 9:30 గంటలకు మంథనిడిపో బస్సులో కరీంనగర్‌కు చేరుకుంది. ఆ తరువాత కరీంనగర్ బస్టాండ్‌లో హుస్నాబాద్ బస్సు ఎక్కుతున్న సమయంతో రద్దీగా ఉండి కొందరు నెట్టే ప్రయత్నం చేశారు. తీరా బస్సులోకి వెళ్లిన కొమురమ్మ తన బ్యాగ్ జిప్ తెరచి ఉండడాన్ని గమనించింది. లోపల మరొక చిన్న బ్యాగ్‌లో భద్రపరిచిన బంగారు ఆభరణాల కోసం వెదికింది. ఆ బ్యాగ్ కనపడలేదు. దీంతో రోదిస్తూ పోలీసుల వద్దకు చేరింది. బస్సులో వచ్చే సమయంలో లేదా కరీంనగర్ బస్టాండ్‌లో ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు తన పద్దెనిమిదిన్నర తులాల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్‌ను చోరీ చేశారని బాధితురాలు తెలిపింది.

వడదెబ్బతో రైతు కూలీ మృతి

వీణవంక, మార్చి 7: కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన నేరుకుంట్ల పర్శరాం (45) అనే వ్యక్తి వడదెబ్బతో గురువారం మృతి చెందాడు. మధ్యాహ్నం పర్శరాం వరి పంటకు ఎరువు చల్లుతున్నాడు. ఎండవేడిమికి ఒక్కసారిగా కుప్పకూలాడు. అక్కడ ఉన్న వారు 108కి సమాచారం అందించారు. సిబ్బంది పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు

వైభవంగా దుబ్బరాజన్న కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సారంగాపూర్, మార్చి 7: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన దుబ్బ రాజన్న ఆలయ జాతర ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తుల ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అత్యంత సుందరంగా రంగురంగుల పూలతో అలంకరించిన కల్యాణ వేదికపైకి స్వామి వారి ఉత్సవమూర్తులను ఆసీనులుగావించారు. ఈ సందర్భంగా అర్చకులు రామోజుల చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో దుబ్బ రాజరాజేశ్వరస్వామి కల్యాణాన్ని జరిపించారు. ప్రభుత్వం తరఫున స్వామి వారికి ఆర్డీవో మధుసూదన్ దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. స్వామి వార్ల కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈవో అదూలరి అనూష, తహసీల్దార్ రమేష్, ఆలయ ఫౌండర్ పొరండ్ల శంకరయ్య, ఆలయ ధర్మకర్తలు కొండ్ర రాంచందర్‌రెడ్డి, వాసం శ్రీనివాస్, పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్

జగిత్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్‌భాషాను గురువారం జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి కలిశారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ యాస్మిన్ భాషాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో ఎన్నికయిన అడువాల జ్యోతిని కలెక్టర్ అభినందించారు. ఈకార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

ధర్మపురి, మార్చి 7: ధర్మపురి మండలంలోని మగ్గిడి ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీలకు గురువారం మంచి స్పందన లభించింది. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి 40 మందికి పైగా వివిధ కేటగిరిల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన వారికి ఈ నెల 9, 10న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైన జట్టు వివరాలు ఇలా ఉన్నాయి. పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్ విభాగంలో శ్రీవాణి, ఆలోహిత, సాత్విక, జూనియర్ మహిళా విభాగంలో పూజిత, త్రిష, సాహితి, అనూష, బాలుర సబ్ జూనియర్ అండ్ జూనియర్స్ విభాగంలో శ్రావణ్, వికాస్, నవనీత్, రాహుల్ ఉన్నారు. జట్టు సభ్యులను మగ్గిడి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ముత్యం బుచ్చన్న, జగిత్యాల పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ రాజేందర్, అధ్యాపకులు అభినందించారు.

'అల్ఫోర్స్'లో ఘనంగా వార్షికోత్సవం

జగిత్యాల అర్బన్, మార్చి 7: పట్టణంలోని స్థానిక ప్రైవేట్ పంక్షన్ హాల్‌లో జగిత్యాల శివవీధి అల్ఫోర్స్ పాఠశాల ఆధ్వర్యంలో అల్ఫోర్స్ పరివర్తన్ పేరుతో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా అతిథులు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ

జగిత్యాలరూరల్, మార్చి 7: జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని తనిఖీ చేసి డేటా ఎంట్రీని పరిశీలించారు. అడిషనల్ కలెక్టర్ వెంట డీపీవో దేవరాజు, ఎంపీడీవో రమాదేవి, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

మల్యాల, మార్చి 7: ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలతో ఓ వృద్ధురాలు మృతి చెందింది. మల్యాల మండల కేంద్రానికి చెందిన రాయకొండ లక్ష్మి(75) అనే వృద్ధురాలు గురువారం వేకువజామున పాల పాకెట్ కోసం దుకాణానికి వెళ్తుండగా ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో ఆమెకు తీవ్రగాయాలు కాగా చికిత్స కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగానే ఆమె మృతి చెందింది. ఈ మేరకు మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ద్విచక్రవాహనదారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మల్యాల, మార్చి 7: మండలంలోని నూకపల్లిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇటుక బట్టీలకు నల్లమట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నామని ఎస్సై తెలిపారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని కోమటికొండాపూర్ గోదావరి నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. గ్రామానికి చెందిన అబ్బిడి శ్రీనివాస్ తన ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కొడిమ్యాల: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం నమిలికొండ గ్రామ శివారులో కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్, పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా పట్టుకున్నారు. పట్టుకున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండ అక్రమంగా ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

కోరుట్ల, మార్చి 7: పట్టణంలోని అల్లమ్మగుట్ట ప్రాంతానికి చెందిన ఈర్నాల భూమయ్య (50) అనే వ్యక్తి అనారోగ్య కారణాలతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భూమయ్య పట్టణంలో ఆటో నడుపు జీవిస్తుండేవాడు. కొద్ది రోజుల క్రితం నుంచి షుగర్ వ్యాధితో పాటు తరుచుగా వచ్చే అనారోగ్య కారణాలతో బాధపడుతుండేవాడు. బుధవారం రాత్రి అందరు నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోని దూలానికి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి

కోరుట్ల, మార్చి 7: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో నూతనంగా నిర్మాణం చేసిన షెడ్డుల్లో సుమారు 60 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని యాచకురాలు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మహిళ ఒంటిపై గులాబీ రంగు జాకెట్, ఆకుపచ్చ రంగు చీర ధరించి ఉంది. ఎండవేడి తట్టుకోలేకనా.. లేక ఏదైనా ఆనారోగ్య సమస్యతో మృతి చెందిందా అన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. కాగా మృత దేహాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు కారులో మంటలు

కథలాపూర్, మార్చి 7: మండలంలోని పోసానిపేట గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం వద్ద ప్రమాదవశాత్తూ కారులో మంటలు చెలరేగి వాహనం పూర్తిగా దగ్ధమైంది. సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థులు బాదితుల కథనం ప్రకారం... నిజమాబాదు జిల్లా ఆర్మూర్‌కు చెందిన ప్రేమ్ కుమార్ తన కుటుంబ సభ్యులతో ఓ కారులో వేములవాడలో జరిగే శివరాత్రి వేడుకలను వెళ్తున్నాడు. దీంతో పోసానిపేట గ్రామం చేరుకోగానే కారు ఇంజన్ నుంచి మంటలు రావడంతో అప్రమత్తమైన ప్రేమ్‌కుమార్ కారులో ఉన్న అతని కుటుంబ సభ్యులను కారు నుంచి కిందికి దించాడు. నిమిషాల వ్యవదిలోనే కారులో పూర్తిగా మంటలు చేలరేగి కారు పూర్తి స్థాయిలో కాలి పోయింది. గమనించిన గ్రామస్థులు అగ్నిమాపక సిబ్బందితో పాటు పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కథలాపూర్ ఎస్ఐ నవీన్ సంఘటన స్థలం చేరుకొని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సంక్షిప్త సమాచారం..

కోరుట్ల: పట్టణంలోని కేరళ హైస్కూల్‌లో వీడ్కోలు సమావేశం నిర్వహించగా నిర్వహించిన ముఖ్యఅతిథిగా ఆర్డీవో అనంద్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఎంఈవో నరేశం, కేరళ పాఠశాల కరస్పాండెంట్ ఎంఎ బారీ పాల్గొన్నారు.

జగిత్యాల అర్బన్: తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ జిల్లా కేంద్రంలో నిర్వహించే 2023-24 సంవత్సరానికి గానూ రెండో బ్యాచ్ ఐదు నెలల ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణ కార్యక్రమానికి ఈ నెల 10న స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్ కుమార్ తెలిపారు.

జగిత్యాలరూరల్: నేషనల్ బైపాస్ హైవే రహదారికి వ్యతిరేకంగా జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి, జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్న పేట రైతులు ధర్నా చేశారు.

కొడిమ్యాల: పదో తరగతి ఉత్తీర్ణులైన తర్వాత ఇంటర్ విద్యకు ప్రభుత్వం కళాశాలలో చేరాలని సామాజిక కార్యకర్త కె. మనోహర్ అన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండి జడ్పీ పాఠశాల పదోతరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన కానిస్టేబుల్ గుజ్జరి సుమన్ పరీక్ష సామగ్రిని అందజేశారు.

కోరుట్ల: ఈనెల 11న నిర్వహిస్తున్న చలో నిజమాబాదు పిఎఫ్ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర బీడి వర్కర్స్ పెడరేషన్ ప్రదాన కార్యదర్శి సుతారి రాములు అన్నారు. పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో ఏర్పాటు చేసిన జగిత్యాల జిల్లా బీడి కార్మికుల సంఘ సమావేశంలో సుతారి రాములు మాట్లాడారు.

మెట్‌పల్లి: మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే తుమ్మల వెంకటరమణ(దామ్) 62వ జయంతి వేడుకలు గురువారం బీజేపీ పట్టణాధ్యక్షుడు బోడ్ల రమేష్ ఆధ్వర్యంలో శ్రేణులు ఘనంగా జరిపారు.

కథలాపూర్: మండలంలోని అంబారిపేటలో గోదాంకు మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ చైర్మన్ లోక బాపు రెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.

పెగడపల్లి: మండల కేంద్రంలోని స్వయంభూ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో గురువారం సామూహిక కుంకుమ పూజలు వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అగ్నిప్రతిష్ఠ స్థాపిత దేవతా హవనములు, కుంకుమపూజ నిర్వహించారు.

మెట్‌పల్లి: ఎలక్ట్రోల్ బాండ్‌కు సంబంధిం చిన వివరాలను సుప్రీంకోర్టు సమర్పించాలని కోరినా ఎస్‌బీఐ బీజేపీకి సంబంధించిన వివరాలను సమర్పించకపోవడంతో మెట్‌పల్లి బ్యాంకు ఎదుట కాంగ్రెస్ శ్రేణులు నిరసన చేపట్టారు. గురువారం పట్టణంలోని ఎస్బీఐ ఎదుట కూర్చోని నినదాలు చేశారు.

మహిళలతోనే దేశాభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యేలు డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

జగిత్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా వేడుకలను నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాతో పలు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న మహిళా అధికారులను శాలువలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళా సహకారంతోనే అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, రాయికల్ జడ్పీటీసీ సభ్యురాలు అశ్విని, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, మహిళా ఉద్యోగినిలు పాల్గొన్నారు.

● జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ పంక్షన్ హాలులో గురువారం జగిత్యాల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి ఆధ్వర్యంలో మహిళా కౌన్సిలర్లతో పాటు ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు విజయ లక్ష్మి, మెప్మా ఏవో శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

● మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మహిళలు చట్టాలపై అవగాహన తప్పనిసరిగా పెంచుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ అన్నారు. జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ప్రధాన న్యాయమూర్తి హాజరై కేక్ కట్ చేసి మాట్లాడారు. మహిళలు తమ హక్కులను గుర్తించి సామాజిక మార్పుపై ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ప్రసాద్, వినీల్ కుమార్, శ్రీనిజ, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీపాల్ రెడ్డి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

జగిత్యాల అర్బన్: జిల్లా టీఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలను సంఘ బాధ్యులు బోగ శశిధర్, మిర్యాల నాగేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు సాహెబ్‌బాబు, రవిచంద్ర, రాజేందర్, రాజేశం, మధుకర్, శ్రీకాంత్, మమత, శైలజ, శ్రావణి, ఇంద్రజ, రాజశ్రీ తదితరులు ఉన్నారు.

- జిల్లా కేంద్రంలో సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు హరి అశోక్‌కు మార్, జీఆర్ దేశాయ్, విజయ్, హన్మంతరావు, యాకుబ్ తదితరులున్నారు.

రాయికల్: రాయికల్ మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. రాయికల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఎంపీటీసీలు, ఎంపీవో సుష్మా, పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లను ఘనంగా సన్మానించారు. జిల్లా పంచాయతీరాజ్ కార్యాలయంలో ఎంపీవో సుష్మా ఉత్తమ మహిళా


కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు, ఇతరులు

ఉద్యోగిగా అవార్డు అందుకున్నందుకు ఘనంగా సన్మానం చేశారు. అలాగే పట్టణంలోని 9వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పట్టణంలోని వివేకవర్ధిని పాఠశాలలో విద్యార్థులు వివిధ వేశధారణలు వేసి ప్రదర్శనలు ఇవ్వగా, విశ్వశాంతి పాఠశాలలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. మండలంలోని భూపతిపూర్ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం చేశారు.

ధర్మపురి: ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, మెప్మా ఆర్‌పీలతో కలిసి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం ప్లాస్టిక్ వాడకం నిర్మూలిద్దామని గోడ పత్రిక ఆవిష్కరించారు. ఆరెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పాఠశాలలో బోధన, బోధనేతర సిబ్బందిని శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ తిరుపతి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులతో పాటు పారిశుధ్య మహిళ కార్మికులను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఏఈ లక్ష్మి, టీపీఎస్ రమ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూర్ గ్రామశివారులోని కేజీబీవీ పాఠశాలలో గురువారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘ జిల్లా నాయకులు అందె శివప్రసాద్, బచ్చువాల కిషన్, గాడిపెల్లి అంజయ్య, దాసరి రమేష్, మహిళ కార్యదర్శి పద్మశ్రీ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో కేజీబీవి ఇన్‌చార్జి స్వరూప, మోహన్ రెడ్డి, ద్యావనపల్లి విష్ణుకుమార్, మంచికట్ల నాగరాజు పాల్గొన్నారు.


రాయికల్‌లో ఎంపీవో సుష్మను అభినందిస్తున్న ఎంపీపీ


కేక్ కట్ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

బీర్‌పూర్: బీర్‌పూర్ మండలంలో గురువారం ఎంపీపీ మసర్తి రమేష్ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవం సందర్భంగా మహిళా అధికారులకు, ప్రజాప్రతినిధులకు మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పాత పద్మ, వైస్‌ఎంపీపీ లక్ష్మణ్ రావు, మండల కోఆప్షన్ మెంబర్ బీజా, ఎంపీటీసీలు ఆదెపు మల్లీశ్వరి, నారపాక రమ, సృజన పాల్గొన్నారు.

పెగడపల్లి: మండల కేంద్రంలో మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పెగడపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీవో ఎ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలతో కలిసి కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, కారోబార్ స్వామి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, వీవోఏలు, మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని మెట్‌పల్లి కోర్టు మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా న్యాయవాదులు, కోర్టు సిబ్బందిని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి ఆధ్వర్యంలో శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం ప్రధానకార్యదర్శి తెడ్డు ఆనంద్, సుమలత, సురక్ష, స్రవంతి, విజయలక్ష్మి, మానస, స్వప్న, రాజ్‌మహ్మద్, వెంకటనర్సయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, వెంకటస్వామి, సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని మార్గదర్శి కాన్వెంట్ పాఠశాల కరస్పాండెంట్ ఏలేటి లక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని వేంపేటలోని మార్గదర్శి కాన్వెంట్ పాఠశాల్లో గురువారం వేడుకులు నిర్వహించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి చిన్నారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మారంపల్లి శ్రీకళ, గాజంగి శిరీష, పెంటపర్తి సువర్ణ, రచన, నవ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో కేజీవిబీ విద్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నరేందర్‌రావు, తపస్ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ప్రసాదరావు, గడ్డం మహిపాల్‌రెడ్డి, జిల్లా జీసీడీవో అనుపమ, ఎంఈవో గాయత్రి, కేజీవిబి స్పెషల్ ఆఫీసర్ మధులత, జగిత్యాల మండల తపస్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేందర్, రమేష్, రఘునందన్ పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

జగిత్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అరవింద్‌నగర్‌లో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితుల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై అలంకరించి కల్యాణం నిర్వహించగా, భక్తులు ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ దంపతులు హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బట్టు సుధాకర్, కొత్త మోహన్, కమటాల శ్రీనివాస్, గుడికందుల శ్రీనివాస్, వీరబత్తిని శ్రీనివాస్, కొత్తపెల్లి శ్రీనివాస్, నాగభూషణం, ఉమాపతి, ముసిపట్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే మడేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో మూల విరాట్టుకు వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు నవగ్రహ పూజలు చేపట్టారు. కార్యక్రమంలో రాధాకృష్ణ శర్మ, భాస్కర్ శర్మ, చంద్రశేఖర్ శర్మ, రాజేందర్ శర్మ తదితరులు ఉన్నారు.

కొడిమ్యాల: మండలంలోని హిమ్మతురావుపేట శివాలయంలో గురువారం శివ కల్యాణాన్ని పండితులు రాధక్రిష్ణశర్మ ఘనంగా నిర్వహించారు. కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై పుర ప్రముఖుల ఆధ్వర్యంలో శివ కల్యాణం ఘనంగా జరిగింది. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కొడిమ్యాల జడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు, సింగిల్‌విండో చైర్మన్ రాజేందర్, రేంజర్ లత, ఏవో జ్యోతి, ఎంఈవో శ్రీనివాస్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు కల్యాణంలో పాల్గొన్నారు.


కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

ధర్మపురి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ధర్మపురి, మార్చి 7: ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో 20 అంశాలు ప్రవేశపెట్టి సభ్యులతో కలిసి ఆమె చర్చించి, ఏకగ్రీవంగా తీర్మాణించి ఆమోదించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, వాహనాల రిపేర్లు, వాటర్ సప్లై రిపేర్లు, నర్సరీల ఏర్పాటు, సిబ్బంది వేతనాలు చెల్లింపు గురించి ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో ధర్మపురి మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్, గంగాధర్, ఏఈఈ శరణ్‌తేజ, జేఏవో గణేష్, టీపీఎస్ శ్రీనివాస్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ గంగాధర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి

ధర్మపురి, మార్చి 7: రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి వాణి అన్నారు. ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామంలో క్షేత్ర స్థాయిలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె వివిధ రకాల్లో వచ్చే చీడపీడల నియంత్రణ గురించి రైతులకు తెలిపారు. ఆమె వెంట ధర్మపురి మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్, ఏఈవోలు మౌనిక, సమత, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో కథలాపూర్ వాసి

కథలాపూర్, మార్చి 7: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి క్రెడిట్ కార్డు నుంచి డబ్బులు మాయం అయిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తికి సైబర్ నేరగాళ్లు కాల్‌చేసి క్రెడిట్ కార్డుపై రుణం వచ్చిందని కార్డుకు వచ్చిన ఓటీపీ చెప్పాలని తెలుపుతూ మాయమాటల చెప్పి కార్డులో ఉన్న 99 వేల రూపాయలను వారి ఖాతాలో జమ చేసుకున్నారు. దీంతో సదరు వ్యక్తికి వచ్చిన సెల్‌ఫోన్ సమాచారంతో పరిశీలించుకోగా తన క్రెడిట్ కార్డు ఉన్న నగదు వారి ఖాతాలో జమ కావడంతో అవాక్కైన వ్యక్తి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి సదరు వ్యక్తి పేరును గోప్యంగా ఉంచారు.

ఎండుతున్న పంటలు


పొలంలో మేస్తున్న మేకలు

మెట్‌పల్లి రూరల్, మార్చి 7: వేసవికి ముందే భూగర్భజలాలు పాతాళానికి పడిపోవడంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రనష్టానికి బలైపోతున్నారు. గురువారం మండలంలోని ఏఎస్ఆర్‌తండా గ్రామంలో గూగ్లవత్ కైకా అను మహిళా రైతు సాగు చేసిన పంటకు నీరందక ఎండిపోతున్న పొలంలో పశువులకు మేతకైనా పని చేస్తుందని వదిలినట్లు తెలిపింది.

ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలి

జగిత్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఎల్‌ఆర్‌ఎస్ అమలు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ వినతిపత్రం అందించారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాను కలిసి పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకులు మున్సిపల్ కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. లే అవుట్ రెగ్యూలరైజేషన్ స్కీంలో భాగంగా భూముల క్రమబద్ధీకరణ కార్యక్రమంలో ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు ఎలాంటి ఫీజులు లేకుంగా ఉచితంగా చేపడుతామని చెప్పిన హామీని నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ ఆందోళనలు చేపట్టామని తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ క్రింద క్రమబద్ధీకరణ కోసం విధించిన ఫీజు విధానాన్ని ఉప సంహరించి ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

జగిత్యాల పట్టణ మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించామని తెలిపారు. కార్యక్రమంలో రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, జడ్పీటీసీ సభ్యురాలు అశ్విని, జగిత్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, నాయకులు గట్టు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ముందుంటాం




కొడిమ్యాల, రాయికల్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, సంజయ్‌కుమార్

కొడిమ్యాల, మార్చి 7: ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ముందు ఉంటుందని చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో 59 మంది లబ్ధిదారులకు 59వేల 944 రూపాయల విలువైన కల్యాణలక్ష్మీ చెక్‌లను అందించారు. విద్యుత్ ప్రమా దంలో మృతి చెందిన గొర్రెలకు 16వేల రూపాయల నష్టపరిహారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనె ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటుందన్నారు. ప్రజాసంక్షేమమె ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమణి, ఎంపీడీవో స్వరూప, ఎంపీటీసీలు రాజేశ్వరీరాజేందర్, జగన్‌మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణ గౌడ్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జీవన్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు మల్లేశం, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి నిరుపేద కుటుంబానికి వరం

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

రాయికల్: కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణలో ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి కింద అందించే చెక్కులు నిరుపేద కుటుంబానికి వరమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. రాయికల్ పట్టణ తహసీల్దార్ కార్యాలయంలో రాయికల్ పట్టణం, మండలానికి చెందిన 125 మంది లబ్ధిదారులకు మంజూరైన కోటి 25 లక్షల విలువ గల కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు.అధికారులు ప్రోటోకాల్‌ను పాటించాలని, అది వారి బాధ్యత అని, ప్రోటోకాల్‌ను విస్మరిస్తే సహించేది లేదని అన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే ఫొటో ఫ్లెక్సీలో లేకపోవడంపై ప్రజాప్రతినిధులు, నాయకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రాయికల్ గుడికోట ఆలయం వద్ద కోటి రూపాయలతో నిర్మించిన కల్యాణ మంటపాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, ఎంపీపీ లావుడ్య సంధ్యారాణిసురేందర్ నాయక్, జడ్పీటీసీ అశ్విని జాదవ్, వైస్ చైర్మన్ గంద్ర రమాదేవి పాల్గొన్నారు.

బీర్‌పూర్: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ చేతుల మీదుగా 46 మందికి 46 లక్షల రూపాయల విలువగల కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీపీ మసర్తి రమేష్, జడ్పీటీసీ పాత పద్మ రమేష్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యం

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి, మార్చి 7: నియోజకవర్గంలోని యువతకు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యమని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని యువతకు ఉపాధి కల్పించడానికి మెట్‌పల్లిలోని వెంకట్‌రెడ్డి గార్డెన్‌లో ఈనెల 11న నిర్వహించే మెగా జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఎంపీపీ మారు సాయిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రానావేణి సుజాత-సత్యనారాయణలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజక వర్గంలోని యువతీ, యువకులకు ఉపాధి కల్పించడం కోసం వివిధ కంపెనీలతో మాట్లాడి మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేశామన్నారు. జాబ్ మేళాలలో 50 కంపెనీలు పాల్గొని 2000 మంది నిరుద్యోగులను ఎంపిక చేస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఏదైనా పీజీ చదివిన నిరుద్యోగుల యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాలలో పాల్గొనే వారు 9948335533, 7893636313 ఫోన్ నంబర్లను ఈనెల 11 ఉదయం 10 గంటలలోపు సంప్రదించి నమోదు చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాను ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లంక గంగాధర్, బంగారుకాళ్ళ కిషోర్, నాయకులు ఎనుగందుల శ్రీనివాస్‌గౌడ్, కొమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జక్కని బాబు పాల్గొన్నారు.

కాలం తెచ్చిన కరువు కాదు..

మెట్‌పల్లి: వ్యవసాయం, తాగు నీరు ఇవ్వమంటే రాష్ట్రంలో గత సంవత్సరం కరువు రావడంతో నీటి సమస్య ఏర్పాడుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కల్వకుంట్ల సంజయ్

అబద్ధపు పలుకులు మాట్లాడుతున్నరని, కాలం తెచ్చిన కరువు కాదు అది కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు కరువని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ విమర్శించారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎల్‌ఆర్‌ఎస్ వద్దంటూ నిరసనలు చేశారని, ఎన్నికల సమయంలో భూములను ఉచితంగా క్రమబద్ధీకరిస్తామన్న కాంగ్రెస్ పార్టీ నేడు మాట తప్పి ప్రజలను మోసం చేస్తోందన్నారు. నాడు అడ్డగోలుగా మాట్లాడిన నేటి కాంగ్రెస్ మంత్రులు, ఇప్పుడు నోరు ఎందుకు విప్పడం లేదని ప్రశ్నించారు. ఎల్‌ఆర్‌ఎస్ అంటే ప్రజల నుంచి డబ్బులు దోచుకోవడమే అన్న కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు ప్రజల నుంచి ఎందుకు డబ్బులు దోపిడీ చేస్తున్నారో ప్రజలకు తెలపాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ కింద క్రమబద్ధికరణ కోసం విధించిన ఫీజు విధానాన్ని ఉపసంహరించి ప్రజలకు ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని ప్రజలు ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఎవరూ కూడా డబ్బులు చెల్లించవద్దని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రానావేణి సుజాత, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.